# కళాపోషకుడు

కళాదేవత మరొకసారి భర్తకోసం వెతకసాగింది.

ఒకప్పుడామెకు ఒక నిర్ణీతమయిన భర్తలేడు. ఆమె అందరితోటి కలిసి జీవించింది. అందరితోనూ సహజీవనం సాగినంతకాలమూ ఆమె జీవితం సహజంగా నడిచింది. ఆ తరువాత ఆమెకు కష్టాలు ఏర్పడ్డాయి.

పరిస్థితులు మారిపోతున్నాయి. అందరూ కలిసి యజ్ఞకర్మ చేసిన రోజులు పోయాయి; కొందరు యజ్ఞం చేసేవారూ, కొందరు చేయించేవారూ అయ్యారు. కర్తలూ భోక్తలూ వేరయారు. ఎక్కువా తక్కువా ఏర్పడింది. కొందరి జీవితాను పెరుగుతున్నాయి. అధిక సంఖ్యాకుల జీవితాలు తరుగుతున్నాయి.

కళాదేవతకు సహజంగా పెరిగే జీవితంపైనే అభిమానం. ఆవిడ అలాటి జీవితాలు గల వారిని భర్తలుగా స్వీకరించింది.

కాని – ఇంగువ కట్టిన గుడ్డ! – అందరితోనూ సహజీవనం చేసే ప్రేరణ ఆమెలో అంతరించలేదు. ఆ ప్రేరణ అణుచుకుంటేగాని ఆమె తన భర్తలతో జీవించలేకపోయింది.

అయితే కళాదేవత త్వరలోనే ఒక వింత విషయం గమనించింది. ఆమెను భరించే వారికి ఆమెపై నిజమైన ఆదరణ లేదు. ఆమె వారి బానిసలలో ఒక బానిస! ఆమె అంతకంటే హెచ్చు హోదా ప్రకటించినప్పుడల్లా వాళ్లు కళ్లెౢ చేశారు. ఇంకొక వింత ఏమిటంటే, హీనమానవులయిన బానిసలు కళాదేవతపై చాలా ఆదరం చూపారు; తమ కష్టాలను ఆవిడద్వారా ప్రపంచానికి వ్యక్తం చేయటానికి తపస్సు సాగించారు. వారి తపస్సు ఆమెను ముగ్ధురాలిని చేసింది. ఆమె వారిపై వెళ్లిపోయింది.

వెంటనే ఆమె భర్తలు ఆమెపై దుమ్మెచల్లారు.

"ఆదేమి చిత్రమో. ఈ కళ మనను కాదని బానిసలను వరిస్తున్నది" అన్నారు కొందరు.

"కళ పతనమైంది. జీవితంలో ఆ నికృష్టుల బాధలు తప్ప ఇంకేమీ లేవా?" అన్నారు మిగిలినవాళ్లు.

వాళ్లు కళపై అలిగి ఆమెను ఉపేక్షించారు. వారి పతనం ప్రారంభమయింది.

మళ్లీ రోజులు మారాయి... రాజులు వచ్చారు. కళాదేవతకు తాళి కట్టారు; అసంఖ్యాకంగా ఉన్న తమ ఉంపుడు కత్తెలమధ్య పెట్టేశారు. ఆకస్మికంగా ఒకనాడు కళాదేవత రాజసౌధాం పహరావాళ్లను తప్పించుకుని తనకోసం అలమటించే సామాన్య ప్రజలను చేరుకున్నది.

ధనికవర్గం వాళ్లు వచ్చారు. కళాదేవతను దగ్గరికితీసి ఆదరించారు. వారికోసం ఆవిడ అచ్చాఫీసులలో, సినిమా స్టూడియోలలో, రేడియో స్టేషన్లలో, డ్రామా నాటిక కంపెనీల రిహార్సల్ రూములలో ఇంకా అనేకచోట్ల శ్రమించింది.

ఈసారి కళాదేవతకు కలిగిన కొత్త అనుభవాలు యేమంటే, ఈ కళాభర్తలు ఆమెను ప్రజలకు దూరంగా ఉంచటంలేదు. పైపెచ్చు ఆమెను ప్రజలపైన ప్రయోగిస్తున్నారు.

"నా భర్తలకు నై పైన ఆదరంగాని ప్రేమగాని లేదు సరేగాని. వీళ్లు నన్ను ప్రజలకు తార్చుతున్నారు. డబ్బు చేసుకుంటున్నారు. నావల్ల తాత్కాలికంగా చవుకబారు ఆనందం పొందటం తప్ప ప్రజలు నానుంచి ఏమేలూ పొందటంలేదు" అనుకున్నది కళాదేవత.

## 2

కళను పోషించటానికి ఒక కొత్త వ్యక్తి అవతరించాడు. ఈ కళాభర్త కోటీశ్వరుడు. పూర్వం కళలను ఆదరించిన రాజులలో ఇంతకంటె ధనికులు లేరు. ఈయన ఇల్లు ఆకాశమంత ఎత్తు. ఈయనకు సొంత విమానాలున్నాయి. కార్లున్నాయి. ఒక సొంత రైలుబండి కూడా ఉన్నది. ఈయన పెట్రోలు ఖర్చుతో కొన్ని వేలమందికి అన్నవస్త్రాలు వస్తాయని అంచనా వేశారు.

తాంబూలంలో వేసుకునే పొగాకు పొట్లాలమ్మి ఈయన లక్షాధికారి అయ్యాడు; ఆ లక్షలు పెట్టుబడిచేసి పబ్లిసిటీ సంస్థలు పెట్టి కోటీశ్వరుడయాడు. అదీ సంగ్రహంగా ఆయన చరిత్ర.

ఆయన పొగాకు పొట్లాల కథ పదిహేడు భాషలలోకి అనువాదమయింది. "ఆయన పొగాకులో నిజమైన పొగాకు ఎంత? అందులో ఆయన ఏమేమి చేర్చాడు?" ఇత్యాది వైజ్ఞానిక సమస్యలను గురించి ఎంతో మంది మేధావులు పత్రికలలో వాదోపవాదాలు జరిపారు.

అది పేటెంటుపుగాదు. దానికన్న మంచిపొగాకు పొట్లాలు చాలా తయారైనాయి. కాని ఒక్కటీ ఎక్కిరాలేదు. ఆయన తన పోటీదార్లందరినీ రకరకాలుగా నిర్మూలించాడు. తన పొగాకుతో పోటీ చేస్తున్న ఒక పొగాకులో నాభి ఉన్నదని పుకారు లేవదీయటానికిగాను యాభై వేల రూపాయలు ఖర్చుచేసి మనుషులను పెట్టాడు. మరొక పోటీదారు తయారుచేసి

తన్నకన్నా చవుకగా విక్రయిస్తున్న పొగాకు పొట్లాలను తన ఏజెంట్లద్వారా కొనిపించేసి మార్కెట్టులోకి రాకుండా చేసేశాడు. ఇంకొక పోటీదారు వ్యాపారాన్ని రెట్టింపుధరకు కొనేవాడు. ఆయన లీలలు చాలా ఉన్నాయి.

కానీ పొగాకు పొట్లంమీద ఈ పెద్ద మనిషి లక్షలు ఎట్లా గడించారు. (ఇటీవల పొట్లం ఖరీదు రెండు నయాపైసలకు పెరిగింది. ఈ పెరుగుదల వల్ల ఆయనకు ఎన్ని లక్షలు అదనంగా వస్తుందో అంచనా వేశారు.)

ఆయన పొగాకులో విశేషం ఏమీలేదు. అందులో పొగాకు దాదాపు ఏమీ లేకపోవటం తప్ప. అలాటప్పుడు దానితో లక్షాధికారి ఎట్లా అయ్యాడు? తన ఆత్మకథలో ఆయన ఈ విధంగా రాసుకున్నాడు :

"ప్రపంచంలో నూటికి ముప్పై ఆరుగురు రోజూ కాఫీ తాగుతారు. కాఫీ పరిశ్రమ పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్ర ఎలా ప్రారంభమయింది? చాలామంది ప్రజలు తమకు కాఫీ కావాలి అని నిర్ణయించుకోవటం వల్ల కాఫీ పానీయం సృష్టి కాలేదు. కాఫీ విత్తుల సారం నుంచి పానీయం తయారు చేసే పద్ధతి ఎవరో కనిపెట్టారు. ప్రచారం మూలంగా ఆ కాఫీ జనానికి పాకింది. ముఖ్యమైనది ప్రచారం – జనానికి పట్టే ప్రచారం. సరి అయిన జరిగితే ఎంతమంది చేతనైనా పొగాకు నమిలించవచ్చు. కేవలం ప్రచారం యొక్క ఉత్కృష్టత మూలంగానే నేను రోజూ రెండుకోట్ల ప్రజల చేతి నా పొగాకు నమిలిస్తున్నాను..."

ఈయన పొగాకు ప్రచారం ఎంత కొత్త పద్ధతుల మీద, ఎంత విజయవంతంగా నడిచిందంటే, అదే పద్ధతులలో ఇతర వ్యాపార సరుకులను ప్రచారం చెయ్యటానికి ఈయన దేశమంతటా సంస్థలను ఏర్పాటు చేశాడు.

"ప్రచారం కనబడితే చాలదు. వినపడాలి!" అని ఆయన నినాదం. ఇందుకుగాను ఆయన ఒక అమెరికన్ ఇంజనీరు చేత ఒకరకం యంత్రం తయారు చేయించాడు. ఈ యంత్రం చిన్న ట్రంకుపెట్టె ప్రమాణంలో ఉంటుంది. ఇందులో ఒక మాగ్నెటిక్ టేపూ, లౌడ్‌స్పీకర్ ఉంటాయి. ఈ టేపు రెండు గంటలసేపు ఆడుతుంది. దానిపైన రకరకాల వ్యాపార సరుకులను ప్రచారం చేసే పాటలు రికార్డ్ చేసి ఉంటాయి. టేపు "లూఫ్" చేసి ఉండటం వల్ల ఎన్నిరోజుల పాటైనా మళ్లీ మళ్లీ నడుస్తూ ఉంటుంది.

అన్ని దేశాలలోనూ పేటెంట్లు పొందిన ఈ పెట్టె కు "నగల పెట్టెలు" అని ముద్దుపేరు పెట్టారు. ప్రపంచంలో ఉన్న అన్ని ముఖ్యనగరాలలోనూ పెద్ద పెద్ద చౌకులలోనూ, పార్కులలోనూ ఈ పెట్టెలు ఏర్పాటయ్యాయి. వీటిని పెట్టుకోనిచ్చినందుకు కోటీశ్వరుడు మునిసిపాలిటీలకు కళ్లు తిరిగిపోయే మొత్తాలు చెల్లించాడు.

ఈ పెట్టెలకు పత్రికలు కొన్ని తీవ్రంగా విమర్శించాయి. కొందరు పార్లమెంట్‌లో

ప్రశ్నలు వేశారు. కాని వాటివల్ల అపకారం ఉందని ఎవరూ రుజువు చెయ్యలేకపోయారు.

"నాకు రాజకీయాలతో నిమిత్తంలేదు. నేను కేవలం పబ్లిసిటీ చేస్తున్నాను. నా చార్జీలు చాలా హెచ్చు. అందుచేత ఘరానా వ్యాపారస్తుడు కానివాడు నాకు కస్టమరు కాలేడు. 1400 పై చిలుకు భాషలలో నా "నగల పెట్టేలు" ప్రకటనలు చెబుతున్నాయి. లిపి కూడా లేని 29 భాషలలో నేను పబ్లిసిటీ జరుపుతున్నాను... నేను కళాసేవకూడా చేస్తున్నాను. ప్రపంచ ప్రఖ్యాతిగల అనేకమంది కవులూ, సంగీతవేత్తలూ నా పోషణలో ఉన్నారు. నా పబ్లిసిటీ పాటలు నిత్యమూ, ఎన్ని కోట్ల మంది పాడి ఆనందిస్తారో ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు" అని ఆయన ఒక యునెస్కో ప్రతినిధితో అన్నారు.

## 3

"ఓహో, సంగీత సరస్వతిగారా? దయచెయ్యండి" అన్నాడు మూడో డిగ్రీ ఎయిర్‌కండిషన్ గదిలో కూచుని ఉండిన కోటీశ్వరుడు.

మొదటి డిగ్రీ ఎయిర్ కండిషన్ గదిలో ఒక అరగంటా, రెండో డిగ్రీ గదిలో ఇంకో అరగంటా వేచి ఉండిన సంగీత సరస్వతికి ఈ కోటీశ్వరుడి ఆప్యాయత ఆటే ఆనలేదు.

"మీరు పిలవగా వచ్చినవాడికే తమ దర్శనం కావటం ఇంత దుర్లభమైంది గదా, నా పనిమీద వచ్చి ఉంటే ఏంకాను?" అన్నాడాయన.

తనకేదో పెద్ద పెద్ద బిరుదు ప్రదానం జరిగినట్టుగా నవ్వి కోటీశ్వరుడు, "ఇది మన ఇద్దరి పనీనూ! మీ చేత కొన్ని పబ్లిసిటీ పాటలు రాయించుకుందామనే ఉద్దేశంతో పిలిచాను. ఇది చాలా గొప్ప గౌరవమని మీకు తెలిసే ఉంటుంది!" అన్నాడు కోటీశ్వరుడు.

"మీ పబ్లిసిటీ పాటలు అనేకం ప్రతి వీథిమూలా వింటున్నాను. వాటిని ఎవరు రాసినా సరిపోతుందే?" అన్నాడు సంగీత సరస్వతి.

"పబ్లిసిటీ మర్మం అక్కడే ఉన్నది. మీకు గొప్ప పేరున్నది. మీరు పబ్లిసిటీ పాట రాశారంటే ఆ పాటకు ఎంత పబ్లిసిటీ అయినా ఉంటుంది. దానితోబాటు మీకూనూ! మీకు గిట్టుబాటు అయేటట్టు చూస్తాను. సాధారణంగా సినిమా కంపెనీల వాళ్ళిచ్చే దానికి – పదింతలిస్తాను. పన్నెంపీ పాటలకు ఇప్పుడే కాంట్రాక్టు రాస్తాను. సగం మొత్తం ఎడ్వాన్సుగా ఇస్తాను!" అన్నాడు కోటీశ్వరుడు.

సంగీత సరస్వతి ప్రాణం దిమ్మరపోయింది. "ఇందులో ఏదో కిటుకున్నది. నేను అడుక్కుతింటున్న రోజుల్లో రాసిన పాటలు కృతులు తక్కువ కావన్నారు. పేరు వచ్చింది. డబ్బులేదు. ఆ పేరును సినిమా కంపెనీల వాళ్లు డబ్బుగా మార్చారు. ఈ మధ్య మా

గురువు గారు కనిపించి, 'నీ సినిమా పాటలు వింటున్నానోయ్!' అంటే ప్రాణం చచ్చినట్టయింది. "ఈ పెద్దమనిషి ఇంకా ఇస్తానంటున్నాడే! నా పెళ్లాం బిడ్డల అదృష్టం!" అనుకున్నాడాయన.

సంతకాలయిపోయాయి. చెక్కు చేతులు మారింది. ఒక్క పాట – నాలుగు పంక్తులవి – ఆయన చేతికిచ్చి నెలలోపుగా స్వరపరచామన్నారు. రెండు నిమిషాలలో సంగీత సరస్వతి దానికి ఆరు రకాలుగా స్వరం తయారు చేశాడు.

కోటీశ్వరుడు శ్రద్ధగా ఆరు పద్ధతులూ విని తల అడ్డంగా తిప్పాడు.

"ఇది పబ్లిసిటీ పాట! ప్రతి నాలుగేళ్ల కుర్రవాడూ, దాన్ని పాడకుండా ఉండలేకపోవాలి. అప్పుడు గాని ప్రకటనదార్లు నాకిచ్చే సొమ్ము గిట్టుబాటు కాదు. మేరే మౌలాబులాలో పాట తెలుసుగా? సరిగా అలాగే దీన్ని కూడా పాడండి. సరిపోతుంది" అన్నాడు కోటీశ్వరుడు.

ఆయన కోరిక ప్రకారం పబ్లిసిటీ పాట పాడుతూ సంగీత సరస్వతి కొత్త పెళ్లికూతురు కన్నా కూడా ఎక్కువగా బిడియపడ్డాడు.

"అంతే! అద్భుతంగా ఉంది!" అన్నాడు కోటీశ్వరుడు.

సంగీత సరస్వతి ఇంటికి వచ్చేస్తూ తనను తాను గట్టిగా గిల్లుకున్నాడు. చచ్చేబాధ కలిగింది!

ఆ రోజు సాయంకాలం సాహిత్య సరస్వతి కూడా కోటీశ్వరుడి దగ్గ చెక్కు పుచ్చుకుని ఇంటికి తిరిగివస్తూ అలాగే తనను తాను గిల్లుకుని బాధపడ్డాడు.

***ముద్రణ : అభ్యుదయ, ఏప్రిల్-మే 1958***